
ప్లాస్టిక్‌పూలు అసలు పూలకంటే తళతళా మెరుస్తాయి. ఆకర్షణీయంగానూ వుంటాయి. అయితే, వాటికి పూల పరిమళం యెలా వస్తుంది.

వేణుగోపాలస్వామి ఆలయంలో పాలరాతితో మలచిన శ్రీకృష్ణుని విగ్రహం మెత్తని, చల్లని చిరునవ్వులు చిందిస్తూ భక్తుల పూజలందుకుంటోంది. తెల్లగా, చల్లగా వున్న ఆ పాలరాతి కట్టడం కృష్ణుడు అప్యాయంగా ఆరగించే వెన్నముద్దలాగానే వుంది చూడ్డానికి.


సూర్యుడు పడమటి కొండలవెనుక జారుతున్న ఆ సాయంత్రం వీస్తున్న చల్లని పిల్లగాలులను అనుభవిస్తూ ఆడా, మగా, పిల్లా, పెద్దా ఒక్కొక్కరే ఆలయానికి వస్తున్నారు. కొందరు కాలినడకన, మరికొందరు రకరకాల వాహనాలమీద.

లోపల పురాణ కాలక్షేపం జరుగుతోంది. పురాణం చెబుతున్న శాస్త్రులుగారు శ్రోతల మెప్పు పొందాలని తన శక్తినంతా ఉపయోగించి పురాణాన్ని రక్తికట్టించాలని ప్రయత్నిస్తున్నారు. గుడిలో ఒకప్రక్క మగవాళ్ళు, మరోప్రక్క ఆడవాళ్ళు. వాళ్ళ మధ్య అక్కడక్కడా పిల్లలు కూర్చుని వున్నారు. ఉద్యోగ విరమణచేసి కాలం గడవక, మనసును తినివేసే సమస్యలు- అంటే వయసు మీరుతున్నా పెళ్ళికాని ఆడపిల్లలు, ఉద్యోగంలేని మగపిల్లలు లేకుండా, ఉద్యోగంలో వున్నప్పుడే ముందుచూపుతో జాగ్రత్తపడి ఇనప్పెట్టె వింపుకుని, ఇల్లు కట్టుకుని ఏ బాదరబందీ లేకుండా వున్నవారు, సమస్యల వలయంలో చిక్కుకుని జీవితంతో హోరాహోరీ పోరాడుతూ అలసిపోయిన మనసుకు భగవంతుని సన్నిధిలో స్వాంతన దొరుకుతుందని ఆశపడేవారు, జీవిత సమస్యలు తాచుపాముల్లా వెంటాడుతుంటే ఆ దేవుడయినా తమను రక్షిస్తాడేమో అనే కొండంత ఆశతో ఆయనకు మొక్కుకోవడానికి వచ్చేవారు, భార్యల పోరుపడలేని భర్తలు, భర్తలపోరు పడలేని భార్యలు, కోడళ్ళ సాధింపులు భరించలేని అత్తలు, అత్తల ఆరళ్ళు భరించలేని కోడళ్ళు, టిప్‌టాప్‌గా తయారయి వయసులో వున్న ఆడపిల్లలను చూడాలని వచ్చే కాలేజీ కుర్రాళ్ళు, బాగా అలంకరించుకుని తమ అందాన్నంతా అబ్బాయిల ముందు ప్రదర్శించాలని వుబలాటపడే అమ్మాయిలు-ఇలా రకరకాల మనుషులతో నిండిపోయింది గుడి. ఆడవారి వయిపు చూసీ చూడనట్లుగా చూస్తూ, చిరునవ్వులు చిందిస్తూ, తన చమత్కారంపు మాటలతో, అందమయిన విగ్రహంతో అందరినీ ఆకట్టుకున్న సోమయాజులుగాక మరొకవ్యక్తి పురాణం చెబుతుండటం భక్తులకు నిరాశను కలిగించినా, ఏదో కొంత కాలక్షేపం చేసుకుపోదాం లెమ్మని చెప్పి కూర్చున్నారు. కొందరు కన్నులు అరగా మూసి భక్తి పారవశ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆలయానికివచ్చే భక్తులలో ముఖ్యులు అనసూయమ్మగారు, పార్వతమ్మగాలు, సావిత్రమ్మగారు, జమునాబాయి, చాముండేశ్వరీదేవి. ఎండ నిప్పులు చెరుగుతున్నా, పిడుగులతో వర్షాలు పడుతున్నా చలి శరీరాలను గడ్డకట్టించేస్తున్నా వాళ్ళు గుడికి రావడం మానరు. కారణం వాళ్ళల్లో అంతో యింతో వున్న భక్తి భావానికి మహా భక్తురాళ్ళు అనే పేరు తెచ్చుకోవాలనే తపన తోడవటం. అనసూయమ్మగారు పొడుగ్గా, సన్నగా, నల్లగా ఎండిపోయిన ములక్కాడలా వుంటారు. మనిషి అనుమానాలపుట్ట. ఆవిడకి జీవితం సుఖంగా వెళ్ళిపోవడానికి తగిన ఆస్తిపాస్తులున్నా, కొడుకులూ, కూతుళ్ళూ జీవితంలో స్థిరపడి సుఖంగా కాపురాలు చేసుకుంటున్నా, ప్రతినిత్యం అనుమానాలతో, అశాంతితో వేగిపోతూ వుంటుంది. ఆరోజు అనసూయమ్మగారి మనసు పురాణంమీద నిలవడంలేదు. ఆమె ఆలోచనలన్నీ మూలగదిలో భోషాణం పెట్టెలోవున్న బంగారునగలూ, వెండి సామానూ, స్టీలుపాత్రలచుట్టూ పరిభ్రమిస్తున్నాయి. 'ఎవరయినా దొంగవెధవ గోడదూకివెళ్ళి ఇల్లంతా దోచేస్తే? ఎవరో ఎందుకు ప్రక్కవాటాలోకి అద్దెకొచ్చిన వాళ్ళు చాలు. కొత్తమనుషులు, వాళ్ళల్లో ఎవరికన్నా చేయి ఆడే గుణం వుందేమో? ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మేట్టుగా లేదు. భోషాణం పెట్టెకి తాళం వేసి, తాళం చెవి భద్రంగా గొలుసులో కట్టుకున్నాను. తొందరలో ఆ మూలగదికి తాళం వేయడం మరిచిపోయాను. ఎలా? వెళ్ళి తాళం వేసివస్తే? ఛఛ, పురాణం మధ్యలో లేచివెళితే అంతా ఏమనుకుంటారు? ఈ గోపీగాడయినా త్వరగా యిల్లు చేరుకుంటే బాగుండును. ఇలా రకరకాల అనుమానాలు, ఆలోచనలు బుర్రలో లేస్తుంటే, ఎప్పుడెప్పుడు ఇల్లు చేరుదామా అన్న ఆత్రుత కలుగుతున్నా, పురాణం ఒక్కముక్క అర్థంగాకపోయినా బింకంగానే కూర్చుంది.



# ప్లాస్టిక్ పూలు

పి. లక్ష్మీ సూర్యప్రభ




పార్వతమ్మగారు తెల్లగా లావుగా బలకత్తా జాంపండులా వుంటారు. ఆమె ప్రతి పలుకులో ప్రతి కదలికలో అతిశయం, ఆడంబరం అహంకారం తొంగి చూస్తుంటాయి. పార్వతమ్మగారి భర్త జిల్లా కలెక్టర్‌గా చేసి రిటయిర్ అయ్యారు. బాగా ఆస్తిపాస్తులున్నాయి. దాంతో పార్వతమ్మగారికి మిగతా వారికంటే తాను అధికురాలునన్న భావం మనసులో బలంగా నాటుకుపోయింది. ఆమెగారి పెద్దల్లుడు అమెరికాలో, చిన్నల్లుడు కెనడాలో వుద్యోగరీత్యా స్థిరపడ్డారు. ఆమె తన కూతుళ్ళ గురించి ఏ మాట చెప్పినా మా అమెరికా అమ్మాయి, మా కెనడా అమ్మాయి అని చెబుతుందే గాని మామూలుగా చెప్పదు. ఆ రోజు పార్వతమ్మగారు కొత్త చీర కట్టుకొని, కొత్తరకం హాండ్‌బాగ్ చేతికి తగి

లించుకుని, కొత్తరకం చెప్పులేసుకుని కొడుకు స్కూటర్ మీద గుడికి వచ్చింది. మిగతా ఆడంగులంతా కుతూహలంగా ఆమె చుట్టూ చేరి, ఆమె కట్టిన చీరనీ, హాండ్ బాగ్‌నీ, చెప్పులీన్ని బాగున్నాయనీ, చాలా ఖరీదయినవనీ మెచ్చుకుంటూ, ఆమె అదృష్టానికి మనసులో ఏడ్చుకుంటూ పైకి నవ్వుతుంటే, వాళ్ళ కళ్ళల్లో కదలాడుతున్న ఈర్ష్యనూ, నిస్సహాయతనూ చూసి పార్వతమ్మగారి గుండెల్లో ఆనంద తరంగాలు వువ్వెత్తున లేచి పడుతున్నాయి. ఆ ఆనందం వెనుక "వీళ్ళ మొహం, వీళ్ళంతా యిలాటి వస్తువులను కనీసం చూసయినా వుండరు. అందుకే అంగలార్చుకుంటూ అలా లేకిగా బయటపడిపోతున్నారు" అన్న చులకనభావంకూడా తలెత్తగా 'ఇవన్నీ ఫారెన్‌వి, మనకిక్కడ కావాలన్నా దొరకవు. ఇదుగో ఈ చీర మా అమెరికా అమ్మాయి పంపింది. ఈ చెప్పులూ, హాండ్‌బాగూ మా కెనడా అమ్మాయి పంపింది. మా అల్లుళ్ళిద్దరూ యిప్పుడక్కడ పెద్ద పొజిషన్‌లో వున్నారు. మమ్మల్నికూడా అక్కడికే వచ్చేయమని పోరుతున్నారు." అంటూ తన కూతుళ్ళూ, అల్లుళ్ళగురించి గొప్పలు వున్నవీ, లేనివీ కల్పించి కళ్ళుతిప్పుతూ, చేతులు ఆడిస్తూ చెబుతుంటే-చుట్టూ చేరిన ఆడవాళ్ళు నోళ్లు తెరుచుకుని వింటున్నారు! వాళ్ళ మధ్య పార్వతమ్మగారు అలా చుక్కల్లో చంద్రుడిలా మెరిసిపోతూ, మురిసిపోతున్న వేళ కోటి సూర్యప్రభలతో వెలిగిపోతూ గరుడ వాహనాన్ని దిగివచ్చే లక్ష్మీదేవిలా, ఆవిడ ఫియట్ కారుదిగి, పూలసామగ్రి వుంచిన వెండిపూలసజ్జ పట్టుకుని మెల్లగా ఆలయంలోకి ప్రవేశించింది. సూర్యుడు కనబడగానే మాయమయ్యే చుక్కల్లా పార్వతమ్మగారి చుట్టూ చేరిన ఆడవారందరూ ఎటువాళ్ళటు వెళ్ళి కూర్చున్నారు. పార్వతమ్మగారు వెలవెలబోతూ వంటరిగా మిగిలిపోయారు. ఇప్పుడందరి చూపులూ ఖరీదయిన ఆ కొత్త ఆడమనిషి మీద వాలాయి. ఏ విషయంలోనయినా ఎదుటి మనిషి తనకంటే గొప్పగా వుంటే సహించలేదావిడ. పట్టు చీరలో, రాళ్ళ నగల్తో ధగధగ మెరిసి మెరిసిపోతున్న ఆవిడని చూస్తూ ముఖం గంటు పెట్టుకుని కూర్చుంది. ట్యూబ్ లైట్ ముందు మసిబారిన దీపం బుడ్డిలా వున్న తన పరిస్థితిని తలుచుకుని పార్వతమ్మగారి మనసు ఈర్ష్యతో, అవమానంతో కుతకుతలాడిపోతోంది. "బొత్తిగా మేనర్స్ తెలియవు ఈ ఆడంగులకు. తెరిచిన నోళ్ళల్లో ఈగలు దూరేది కూడా తెలియకుండా ఆ మనిషికేసి ఎలా చూస్తున్నారో! అదిగో అప్పుడే ఆవిడ చుట్టూ చేరారు ఫియట్ కారులో వచ్చిందని. రాళ్ళనగల్తో మెరిసిపోతోందని పడిచచ్చిపోతున్నారు. గొర్రెల మంద. గొర్రెల మంద" అని ఆడవాళ్ళని, కారు తన కోసం వుంచకుండా క్లబ్‌కు తీసికెళ్ళిన భర్తనీ కసిదీరా మనసులో తిట్టుకున్నారు. అసహనంగా, ముళ్ళ మీద కూర్చున్నట్టుగా కూర్చున్న పార్వతమ్మగారి చెవిన పురాణం ఒక్కముక్కకూడా పడటంలేదు. సావిత్రమ్మగారు భోజనప్రియురాలు. ఆవిడ యెవరితోనైనా "ఇవ్వాళ కూరేం చేశారు?" అనో, పండుగ రోజుల్లో "ఏమేం పిండివంటలు చేశారు?" అనో ప్రశ్న వేసిగాని సంభాషణలోకి దిగదు. రకరకాల వంటలు, పిండి వంటలు చేయడం ఆవిడకి కొట్టిన పిండి. ఏ వంటకం గురించైనా ఆవిడ చెప్పడం మొదలెట్టిందంటే వినేవాళ్ళ నోళ్ళల్లో నీరూరిపోవలసిందే.

"చూడమ్మాయ్ యిలా వండితే యెంత మధురంగా వుంటుందనుకుంటావ్! అలా వండి తింటే ఎంత కమ్మగా వుంటుందో వదినా!" ఇలా సాగుతుంది ఆవిడ ధోరణి. కొడుక్కి పెళ్ళయి కోడలు కాపురానికి వచ్చిన దగ్గరనుంచీ వంటిల్లు కోడలుపిల్ల ఆక్రమించుకోవడంతో ఆవిడ సామ్రాజ్యాన్ని కోల్పోయిన మహారాజ్ఞిలా డీలాపడిపోయింది. భర్త పోయిన తర్వాత కొడుకు సంపాదన మీదే కుటుంబమంతా ఆధారపడటంతో ఇంటి పెత్తనమంతా కోడలు చేతిలోకి వెళ్ళిపోయింది. దానితో సావిత్రమ్మగారికి మిఠాయిలు, పిండి వంటలు చేసుకుతినే అవకాశం లేక ఆవిడ నోరు చవి చచ్చిపోయినట్లుగా అయింది. ఆ రోజు ఆవిడ మనసంతా వంటింట్లోనే వుంది.

మనవడి పుట్టిన రోజుకు లడ్లు, కజ్జికాయలు చేస్తోంది కోడలు. లడ్డులలో జీడిపప్పూ, కుంకుమ పువ్వూ జాస్తిగా వేస్తుందో లేదో! బూందీని డాల్డాలో దూస్తుందో? నేతిలో దూస్తుందో? నేతి లడ్డు రుచి దేనికీరాదు. ఆయన బ్రతికున్న రోజుల్లో ఇంట్లో నిత్యం సంతర్పణ చేసినట్లుగానే వుండేది. మహారాజు ఏలోకాన వున్నారో, ఫలానా సరుకు కావాలండీ అని చెప్పడం ఆలస్యం. విసుక్కోకుండా వెళ్ళి తెచ్చి పడేసేవారు. ఆ రోజులు వేరు. ఆ మనుషులు వేరు. ఆ తిండ్లూ వేరు. అటువంటి రోజులు మళ్ళీ రావు. ఉప్పుకీ, పప్పుకీ, చింతపండుకీ కటకటపడే మాయదారి రోజలొచ్చాయి ఇంతకీ కోడలు పప్పుచారులో ఇంగువ పోపు పెడుతుందో లేదో! పొట్లకాయ కూరలో పాలచినుకు వేస్తే కూర ఎంత మధురంగా వుంటుందో? నాలుక మీద స్వర్గం నిలిచినట్లుగా వుంటుంది. ఆలోచనలలో తేలిపోతున్న సావిత్రమ్మగారు యిహలోకానికి వచ్చిపడ్డారు-జమునాబాయి పిలుపుతో. తాను పరధ్యానంగావుండి పురాణం వినడంలేదని ఎవరైనా గమనించారా అని కంగారుగా చుట్టూ పరికించి చూశారు. ప్రక్కనే కూర్చునన్న జమునాబాయి ఆవిడ తొడమీద చిన్నగా చరిచి "చూడండి పిన్నిగారూ! అటు ఆ స్తంబం చాటున చూడండి. అక్కడ కూర్చున్న ఆ జంటని చూశారా, స్టూడెంట్స్‌లాగానే వున్నారు. ఎంత దగ్గరగా మోకళ్ళ వాళ్ళో మోకళ్ళు కూచున్నట్లుగా కూర్చున్నారో గమనించారా! బొత్తిగా బరితెగించి పోతున్నారు ఈ కాలం పిల్లలు. చుట్టూ యింతమంది జనం వున్నా




రన్న జ్ఞానంకూడా లేనట్లుంది. మరీ పిదప కాలం. పిదప బుద్ధులు. అన్నట్టు అమ్మాయ్. యివ్వాళ కూరేం చేసావ్?" ఆవిడ ధోరణి తెలిసినదే అయినా జమునాబాయికి ఆ క్షణంలో చిరాకువేసింది. అయినా శాంతంగానే సమాధానం చెప్పింది. "వంకాయకూర, ములక్కాడల పులుసు పిన్నిగారూ!" "ఆరోజుల్లో నేను గుత్తివంకాయ కూరొండి, రెండు శేత ములక్కాడలువేసి పప్పులుసుపెడితే వంటిల్లంతా ఘుమ ఘుమలాడిపోయేదనుకో" అంటూ వంటల గురించి ఆవిడ లెక్చెర్ మొదలెట్టబోతుంటే.

"సరేలే పిన్నిగారూ, ఈ వంటలగొడవ మనకు రోజూ వుండేదేగా అటుచూడండి. ఆఅబ్బాయినీ అమ్మాయినీ నేనురోజూ గమనిస్తూనేవున్నాను. రోజూ చిలకా గోరింకల్లా కూర్చుని గుసగుసలు చెప్పుకునేవాళ్ళు, పల్లదనాలు పడేవాళ్ళు, విరగబడి నవ్వుకునే వాళ్ళు. ఈవేళ ఆ పిల్ల ఏడుస్తోంది. అతగాడు వోదారుస్తున్నాడు. ఇదేదో కాలుజారిన వ్యవహారం లాగానే కనబడుతోంది" అంది జమునాబాయి ముందుకు వంగి గుసగుసగా. 'రోజూ వుండే కూరల గొడవేగా' అన్న జమునాబాయి ఈసడింపుతో చిన్నబోయిన సావిత్రమ్మగారు అంతలోనే సర్దుకుని ఆ జంటను జాగ్రత్తగా పరిశీలించడం మొదలెట్టింది. ఆ అబ్బాయి కర్చీఫ్ తీసి బుజ్జగిస్తున్నట్టుగా ఆ అమ్మాయి కళ్లు తుడుస్తూ చిరునవ్వులు చిందిస్తుంటే ఆ పిల్ల కూడా ఏడవటం మాని చిన్నగానవ్వుతూ ఏదో చెబుతోంది.

"నిజమే నమ్మాయ్ ఇదేదో ఆ వ్యవహారం లాగానే కనబడుతోంది." అంది సావిత్రమ్మ మరింత గుసగుసగా. అప్పటికే చుట్టూ కూర్చున్న ఆడంగుల చెవులూ, కళ్ళూ పురాణం చెబుతున్న శాస్త్రిలుగారిని వదిలిపెట్టి వీళ్ళ దగ్గరకు చేరాయి. అందరూ కుతూహలంగా, ఆత్రంగా ఆ జంటను చూడసాగారు. జమునాబాయి తాను చూసిన సన్నివేశాలకు కల్పనలు జోడించి రంజు రంజుగా చెప్పుకుపోతోంది. ఆడవాళ్ళంతా 'హన్నన్నా', 'ఆ', 'ఆహా' అంటూ బుక్కల మీదా, నోళ్ళ మీదా వేళ్ళువేసుకుని ఆమె చెబుతున్న ప్రతి అక్షరాన్ని అతిజాగ్రత్తగా వింటున్నారు— జమునాబాయి చుట్టూచేరి. ఎవరికి తోచిన విధంగా వాళ్ళు వ్యాఖ్యానించడం మొదలెట్టారు.

"మరేనమ్మా ఈ కాలం పిల్లలు పిల్లల తీరున వుంటున్నారా? పెద్దల అదుపు ఆజ్ఞల్లో వుంటున్నారా? ఆడా మగా




తేడా లేకుండా జుట్లు పెంచుకుని, బట్లేసుకుని. విచ్చలవిడిగా తిరగడం." అని ఒకరంటే, మరొకరు అందుకుని "కాదుటమ్మా ఈ ఫామిలీ ప్లానింగొకటొచ్చి జనానికి నీతి నియమాలు లేకుండా చేసినది. మా కాలంలో యివన్నీ ఎరగం తల్లీ! అయినా ఆడపిల్లలన్న తర్వాత హద్దుల్లో వుండొద్దూ? మొన్న ఆ భీమశంకరం గారమ్మాయి, యిలాగే కాలేజీలో చదువుతుంటే పెళ్ళి కాకుండానే కడుపొచ్చింది. గుట్టుచప్పుడు కాకుండా తీయించి అవతల పారేశారులెండి. డబ్బు నీళ్ళప్రాయంగా ఖర్చుచేసి ఆ బరువు వొదుల్చుకున్నారట." ఇలా సాగిపోతోంది వాళ్ళ ధోరణి.

"నాలుగు క్షణాలు ఆ భగవంతుని సన్నిధిలో గడిపి నాలుగు మంచిమాటలు చెవిన వేసుకుందామనివస్తే ఇదేం గొడవ? మీరసలు గుడికెందుకు వస్తారు? వాళ్ళ వూసులూ వీళ్ళవూసులూ చెప్పుకుని కాలక్షేపం చెయ్యడానికా? భగవత్ సాన్నిధ్యంలో కూర్చుని ఆ రంకు కబుర్లేమిటి? ఈ నాలుగు నిముషాలన్నా మనసును ప్రశాంతంగా వుంచుకోలేకపోతే ఇక కోవెలకు రావడం ఎందుకు" అని ఓ పండు ముత్తయిదువ కసురుకోవడంతో అందరూ కాస్త తమ తమ స్వరాల స్థాయి తగ్గించి మాట్లాడసాగారు. జమునాబాయి అప్పుడే మధ్యవయసులో కాలు పెడుతున్న మహిళ. ఆవిడకి చిన్నతనంలోనే భర్తపోయాడు. పునర్వివాహానికి అంగీకరించలేని సనాతన కుటుంబం కావడంతో సంప్రదాయపు పంజరంలో ఆచారాల సంకెళ్ళతో బంధింపబడింది జమునాబాయి. సమాజానికి భయపడి కొంతా, చుట్టూవున్న వారిలో నియమనిష్టలు గలదీ, నిగ్రహపరురాలు అన్న పేరు తెచ్చుకోవాలని కొంతా జమునాబాయి తన సహజయవ్వన కాంక్షలను అణిచి వేసుకుంది. కోరికల రెక్కలను కత్తిరించి వేసింది. ఆమెకు మగవాడి ప్రేమ అంటే తెలియదు. పురుష స్పర్శ ఎలా వుంటుందో వూహించుకోవలసిందే తప్ప తెలుసుకునే అవకాశం లేదు జమునాబాయికి. దానితో ఆవిడకు స్త్రీ పురుష సంబంధాల పట్ల ఆసక్తి ఎక్కువయింది. ఏ జంట కనబడినా వారిని గురించి ఆవిడ ఏవేవో వూహించుకుంటూ వుంటుంది. దానికితోడు చుట్టూవున్నవాళ్ళ మెచ్చికోలు మాటలు, పొగడ్తలతో మిగతా ఆడవాళ్ళకంటే తాను నిగ్రహపరురాలననీ, పవిత్రురాలననీ గట్టి నమ్మకం ఏర్పడటంతో ఎదుటి ఆడవారిమీద చాలా తేలికగా అభాండాలు, అపనిందలువేస్తూ ఎనలేని తృప్తిని ఆత్మానందాన్ని అనుభవిస్తూ వుంటుంది జమునాబాయి.

పొట్టిగా, సన్నగా, ఎర్రగా తాటాకుబొమ్మలా వుండే చాముండేశ్వరీదేవి ఒక సామాన్య గుమాస్తా భార్య. ఆరుగురు పిల్లల తల్లి. లౌక్యం తెలిసిన మనిషి. ముఖ్యంగా బ్రతకనేర్చిన మనిషి. తన చుట్టూవున్న మనుషుల బలహీనతలను ఆధారంగా చేసుకుని తన పబ్బాన్ని గడుపుకోగల నేర్పరి. ఆరోజు ఆవిడ మెల్లగా పార్వతమ్మగారి ప్రక్కన చేరింది. తాను చేయబోయే ప్రస్తావనకు

నాంచిగా "వదినగారూ! ఈ రాళ్ళగాజులు క్రొత్తగా చేయించుకున్నారా? మిలమిల మెరుస్తూ ఎంత ముద్దొస్తున్నాయో! ఈ హాండ్‌బాగ్ అమెరికా అమ్మాయిగారు పంపారా? సీమసరుకు సీమసరుకే—చూడంగానే తెలిసిపోతుంది. మొన్న గృహప్రవేశం చాలా బాగా చేశారట. మావారు చెప్పారు. ఆ హోదా, దర్జా తరహాయే వేరని ఎంతసేపు మెచ్చుకున్నారో చెప్పలేను" ఈర్ష్యతో, అవమానంతో భగభగమండుతున్న పార్వతమ్మగారి హృదయం మీద చాముండేశ్వరీదేవి మెచ్చుకోలు మాటలు వర్షపు చినుకుల్లా పడుతుంటే తన గొప్పతనాన్ని గుర్తించిన ప్రాణి ఒకటుందని ఆవిడ కొంత శాంతించింది. పార్వతమ్మగారి ముఖంలో కొద్దిగా ప్రసన్నత చోటు చేసుకుంది. అది గమనించి చాముండేశ్వరీదేవి ఆవిడని మరింత పొగిడింది. పొగడ్తలతో పార్వతమ్మగారి ముఖం అరుణోదయంతోపాటు క్రమక్రమంగా విచ్చుకునే కమలంలా వికసించడం మొదలెట్టింది. గుండెను సలుపుతున్న క్రొత్తా విశ ఆధిక్యతను తాత్కాలికంగా మరచిపోయింది. తనకు అనుకూలమయిన మార్పు ఆవిడ ముఖంలో కనబడగానే చాముండేశ్వరీదేవి "మనం మనం ఒకటి. ఒక కులంవాళ్ళం కాకపోయినా తమది వెన్నలాటి మెత్తని మనసు. ఎదుటి మనిషి బాధలను చూసి యిట్టే కరిగిపోతారు" అంటూ మాట్లాడేసరికి పార్వతమ్మగారు ఆనంద పులకితురాలయింది. ఆవిడ తలను అలవోకగా వూపుతూ చిరునవ్వుతో చాముండేశ్వరి మాటలు వింటోంది.

"చూడండొదినగారూ! పిలాజెల్లాతో రోగాలూ రొస్టులతో, అప్పుసప్పులతో బ్రతకడమే కష్టంగా వుందనుకోండి. ఆయన తెచ్చే నాలుగు జీతంరాళ్ళు ఏ మూలకూ చాలడం లేదంటే నమ్మండి. మా రెండోవాడు B. A. ప్యాసై రెండేళ్లు దాటుతోంది. ఉద్యోగం సద్యోగం లేకుండా తిరుగుతున్నాడు. ఆ తాలూకాఫీసులో ఏవో ఖాళీలున్నాయని మా వారు కనుక్కొచ్చారు. ఏదో వాడికీ ఓ చిన్న ఉద్యోగం వుంటే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా సహాయంగా వుంటుందని నా ఆరాటం. అన్నయ్యగారి లాంటి పెద్దగారు వాక్కుమాట చెబితే పని అవుతుందట. తమ రొకనారి అన్నయ్యగారి చెవిన ఈ మాటవేస్తే చాలు, యిట్టే పని అవుతుందని ఆయన చెప్పారు." అని మెల్లగా మెత్తగా చెబుతుంటే, అడిగినదే తడవుగా వరాలు ప్రసాదించే దేవత ప్రదర్శించే ఔదార్యం గాంభీర్యం ప్రదర్శిస్తూ "అలాగే చెబుతాలే. దానిదేముంది. ఈ జిల్లాలో ఆయన మాటకు తిరుగులేదు." అని వొకసారి కంఠాభరణాలనూ, రాళ్ళగాజులనూ గర్వంగా సవరించుకుంది.

"గుండినట్టే వుందిలే నీ బోడిపోజు." అని మనసులో కసిగా అనుకున్నా ముఖానికి చిరునవ్వు తెచ్చుకుని "వస్తానండీ వదినగారూ! ఆ మాట మాత్రం మరచిపోకండి" అంటూ వినయంగా పార్వతమ్మగారి దగ్గర సెలవుతీసుకుంది. చాముండేశ్వరిదేవి. "బాగున్నారా అక్కయ్యగారూ, ఈ మధ్య మీరు సరిగ్గా కోవెలకువస్తున్నట్లు లేరు" అంటూ సావిత్రమ్మ ప్రక్కన చేరింది చాముండి. "ఏంబాగునే చాముండీ ఆయనతోపాటే నా దశంతా పోయింది. ఈ మధ్య వంట్లో బాగుండటంలే. కీళ్ళన్నీ ఒకటే నెప్పులు. దానికితోడు బి. పి. సుగరుకూడా తగలడ్డాయి." అంది దిగాలు పడిపోతూ. "పెద్ద వయసులో ఈ బాధలు ప్రతివారికీ వుండేవే. మంచి డాక్టర్‌కి చూపించుకోక పోయినారా? ఏమయినా మీ చేత్తో ఏంవండినా అమృతంలా వుంటుంది. ఎప్పుడో మీ యింట్లో తిన్న పులిహోర తలచుకుంటే యిప్పటికీ నోట్లో నీరూరుతుందంటే నమ్మండి అన్నట్టు మరిచాను. మా రెండోది నీళ్ళోసుకుంది. ఒకటే డోకులు. ఏదీ సయించడంలేదు. మీ చేత్తో చేసిన చింతకాయ పచ్చడి కావాలని కబురు చేసింది" అని సావిత్రమ్మను వుబ్బించి, ఆమెచేత 'సరే' అనిపించుకుని లేచింది చాముండేశ్వరీదేవి.

"ఏంవోయ్ జమునా! ఎక్కడా కనబడ్డంలేదు. మరీ నల్లపూసవయిపోయావ్" అంటూ జమునాబాయి ప్రక్కన చేరింది. "పోయిన నెలలో మా పింతల్లి కొడుకు పెళ్ళికి అమలాపురం వెళ్ళాను అదుగో, యిదుగో అంటూ ఆవిడ నన్నక్కడే వుంచేసింది నెలరోజులు. నాన్నగారు ఖులాసాగా తిరుగుతున్నారా? ఆ మధ్య బి. పి. ఎక్కువై పడిపోయారని యెవరో చెప్పారు"

"ఏం బాగు అక్కయ్యగారూ! ఆయనగారికి వయసు మీదపడటంతో ఛాదస్తం యెక్కువయింది. ప్రతిదానికీ పేచి. ప్రతి చిన్న విషయానికీ ఆవేశపడి పెదగా కేకలు వేయడం. ఒక పసిపిల్లవాడిని సంరక్షించిన విధంగా సంరక్షించాల్సొస్తోంది" జమునాబాయిని యెప్పుడెప్పుడు పొగిడి వుబ్బేద్దామా అని చూస్తున్న చాముండేశ్వరికి మంచి అవకాశం దొరికింది.

"కాదు మరీ. నువ్వు కాబట్టి చిన్నతనంలోనే భర్తను పోగొట్టుకున్నా మళ్ళీ పెళ్ళిమాట తలపెట్టకుండా తండ్రిని అంటిపెట్టుకుని వున్నావు. మరొకరయితే ఈపాటికి ఎంతెంత గ్రంథాలు నడిపేవారో. నీకేం తక్కువ? అందగత్తెవి. ఆస్తిపరురాలివి. నువ్వు కావాలని కోరుకుంటే ఏ మగాడయినా నీ పాదాల దగ్గర వాలేవాడు. ఏమైనా నీ తరహాయే వేరు. మంచి వయసులోవున్నా నిగ్రహంగా, నిష్టనియమాలతో బ్రతుకుతున్నావు. అందరికీ ఆ ఆత్మనిగ్రహం అలవడుతుందా? దానికి ఎంత సాధన కావాలి? ఎంత దీక్ష వుండాలి" అంటున్న చాముండి మాటలకు జమునాబాయి గుండె ఆనందంతో ఉప్పొంగిపోయింది. ముఖంలో గర్వరేక పొడసూపింది. "ఆ అన్నట్టు జమునా! సంక్రాంతి వస్తోందికదా. మా చంటిది కొత్తగౌను కుట్టించమని ఒకటే గోల చేస్తోంది. వాళ్ళ నాన్నగారు ఒక సిల్కుగౌను గుడ్డ తెచ్చారు. నీ దగ్గర సింగర్ కుట్టుమిషను వుందిగా, శ్రమ అనుకోకుంటా కుట్టిపెడతావేమిటి?" పొగడ్తల మైకంలో మునిగిపోయిన జమునాబాయి "దానికేం భాగ్యం అక్కయ్యా! రేపు మీరు గుడికి వచ్చేటప్పుడు పట్టుకురండి. అలాగే కుట్టి పెడతాను" అంది.

"వస్తానమ్మా జమునా! భోజనాలవేళ అయింది పిల్లలంతా గోలచేస్తూవుంటారు" అంటూ వెళ్ళింది చాముండేశ్వరీదేవి.

వేణుగోపాలస్వామి శిరసు మీదా, మెడలో, పాదాలవద్దా రకరకాల రంగు రంగుల పూలు ఎన్నో వున్నాయి. కొన్ని పూలు సహజమయినవి. అవి తమ గుండెల్లో దాచుకున్న సౌరభాలను వెదజల్లుతూ స్వామిసేవకు తమను తాము ఆనందంగా అర్పించుకుంటున్నాయి. మరి కొన్ని ప్లాస్టిక్ పూలు! చూపులకు నిజమయిన పూలలాకనిపించినా వాటికి సువాసనలు లేవు. ఆ ప్లాస్టిక్ పూలఎదలు శూన్యగృహాలు తన చుట్టూ పేర్చిన పూలనూ, తనచుట్టూ చేరిన రకరకాల మనుషులను చూస్తూ స్వామి మౌనంగా చిరునవ్వులు చిందిస్తున్నాడు. ప్లాస్టిక్ పూలనూ, ప్లాస్టిక్ పూలవంటి భక్తులను చూసి ఆ వేణుగోపాలస్వామి ఏమనుకుంటున్నాడో?

